సాక్షి
నంద్యాల

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి కృష్ణాజిల్లాకు చెందిన శ్రీశ్రావణి ఆల్కోబ్రేవ్ ప్రైవేట్ లిమిటెడ్‌వారు సోమవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



19 నుంచి బన్ని ఉత్సవం

హొళగుంద: దేవరగట్టు బన్ని ఉత్సవాలు అక్టోబర్ 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 24న బన్ని ఉత్సవం, 26న రథోత్సవాన్ని నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు.



చెంచులకు వసతుల కల్పన

జీ తాడిపత్రి చెంచుగూడెం చెంచులకు వసతులు కల్పిస్తామని జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి పేర్కొన్నారు. 2కి.మీ దూరంలో కొండ ప్రాంతంలోని గూడెంకు ఆయన కాలినడకన వెళ్లారు. 8లో▸

న్యూస్‌రీల్

28న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి అరుణాచల క్షేత్రానికి ఈ నెల 28వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి ప్రయాణికుల సౌకర్యార్థం అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నామన్నారు. ఈ సర్వీసు గురువారం ఉదయం 6 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు శుక్రవారం సాయంత్రం అరుణాచలం నుంచి బస్సు బయలుదేరి వేలూరు మీదుగా నంద్యాల చేరుకుంటుందన్నారు. కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయాల్లో ప్రయాణికులు భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలుగా బస్సును ఆయా క్షేత్రాల్లో నిలుపుతామన్నారు. ఈ సర్వీసుకు చెందిన టికెట్లను బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్, apsrtconline.inలో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద



శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల జలాశయానికి రెండు రోజులుగా వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుదుత్పత్తి జరుగుతుండడంతో శ్రీశైలానికి వరద జలాలు వస్తున్నాయి. సోమవారం సాయంత్రానికి జూరాల నుంచి 17,919 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. జలాశయం నుంచి ఆదివారం నుంచి సోమవారం వరకు 6,354 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ నుంచి 2,000 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400, హంద్రీనీవా సుజలస్రవంతికి 1885 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, సోమవారం సాయంత్రానికి జలాశయంలో 87.2691 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 853.60 అడుగులకు చేరుకుంది.

నలుగురు సీఐలకు స్థానచలనం

బొమ్మలసత్రం: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న నలుగురు సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న రామాంజులును కోవెలకుంట్ల సీఐగా బదిలీ చేశారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న నారాయణరెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. శిరివెళ్లలో సీఐగా విధులు నిర్వహించే చంద్రబాబు నాయుడును నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేశారు. నంద్యాల ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న సూర్యమౌళిని జిల్లా స్పెషల్ బ్రాంచ్ –2 సీఐగా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కోడుమూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.నాగరాజును సస్పెండ్ చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తరచూ గైర్హాజరు అవుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నివేదిక అందించారన్నారు. ఆ మేరకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశామన్నారు.

486 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 486 మంది ప్రధానోపాధ్యాయులకు డీఈఓ రంగారెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఆగస్టు నెలకు సంబంధించిన కోడి గుడ్లు, చిక్కీల బిల్ కన్ఫర్మేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంలో జిల్లా అధికారులు ఎన్ని సార్లు హెచ్చరించినా ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు.

సర్వేజనా ఆరోగ్యమస్తు

- జిల్లాలో శరవేగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే
- ఇప్పటి వరకు 1.34 లక్షల మందికి వైద్య పరీక్షలు
- వ్యాధిగ్రస్తులకు టోకెన్ల పంపిణీ
- 30వ తేదీ నుంచి వైద్య శిబిరాల నిర్వహణ

పోటీ ప్రపంచంలో అందరివి ఉరుకుపరుగుల జీవితాలు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను విస్మరించడంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. చివరకు అనారోగ్యాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టింది. ముందుగా ఇంటింటి ఆరోగ్య సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి, ఆ తర్వాత వైద్య శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది.



నంద్యాలలో వృద్ధురాలికి షుగర్ టెస్ట్ చేస్తున్న హెల్త్ సెక్రటరీ



ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలో రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం.. అంటూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి నాంది పలికింది. ఇప్పటికే విలేజ్ హెల్త్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశ పెట్టి వైద్య సేవలను మరింత చేరువ చేసింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించబోతుంది. ఈ మేరకు నంద్యాల జిల్లాలోని 29 మండలాలతో పాటు 7 అర్బన్ ప్రాంతాల్లో 369 వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలకు ముందుగా ప్రతి ఇంటిలోని అందరి ఆరోగ్యం గురించి వైద్య సిబ్బంది తెలుసుకుంటారు. గుర్తించిన సమస్యలు వైద్యానికి నయమైతే వారికి సత్వరం వైద్యం అందిస్తారు. ఒకవేళ దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే సంబంధిత ఆరోగ్యశ్రీ ఆసుపత్రిలో ఉచిత వైద్య సదుపాయాలు అందేలా చేసి వారిని ఆరోగ్యంతులుగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జిల్లాలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలోని సచివాలయాల హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు ఇంటింటీ సర్వేలు నిర్వహించి అవసరమైన వారికి క్యాంపుల ద్వారా వైద్య సేవలను అందించనున్నారు. ఇదివరకే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ అవసరమైన ధ్రువపత్రాలను అందించిన ప్రభుత్వం ప్రస్తుతం మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతోంది.

2.33 లక్షల వైద్యపరీక్షలు

పేదల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ముందుగా పౌరులకు ఉచితంగా 7 రకాల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో సుమారుగా 1,34,541 మందికి 2,33,159 వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారు. సాధారణంగా సామాన్యులకు అవసరమయ్యే హైపర్‌టెన్షన్, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్ టెస్ట్, స్పుటమ్(గళ్ల)పరీక్ష, మలేరియా, డెంగీ వంటి పరీక్షలు ఉచితంగా ప్రజల ఇంటివద్దనే చేస్తున్నారు. పరీక్ష ఫలితాలను నమోదు చేసి వైద్య శిబిరం రోజు మందులు అవసరమైన వారికి ఉచితంగా అందిస్తారు. వ్యాధి తీవ్రంగా ఉంటే మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ సంబంధిత ఆసుపత్రులకు రెఫర్ చేసి వారికి పూర్తి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటారు.

ఐదు దశల్లో కార్యక్రమం నిర్వహణ

- ఇప్పటికే పలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి సర్వే ఈ నెల 15వ తేదీన మొదలయ్యింది. మొదట స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి సురక్ష క్యాంపుల గురించి అవగాహన కల్పిస్తున్నారు. సీహెచ్‌ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్,) లేదా ఏఎన్ఎంలు ఆ ఇంటికి ఎప్పుడు వస్తారనే సమాచారాన్ని తొలి దశలో ప్రజలకు అందిస్తారు.
- సర్వే అనంతరం ఫీవర్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించడమే కాకుండా ప్రతి వ్యక్తి ఆరోగ్య సమస్యలను గుర్తించి వాటిని నమోదు చేసుకుని వారి అంగీకారం మేరకు ఇంటి వద్దనే 7 రకాల పరీక్షలను రెండవ దశలో చేస్తారు.
- 3వ దశలో వలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సేవాభావం కలిగిన వ్యక్తులు బృందాలుగా మరో మారు ఇంటింటికీ వెళ్లి వార్డు లేదా గ్రామంలో ఎప్పుడు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తారు అనే సమాచారం మేరకు టోకెన్లు ఇస్తారు.
- 4వ దశలో వైద్యశిబిరాలు మొదలు పెట్టి 45రోజుల పాటు ప్రజలందరికీ ఆరోగ్యాన్ని పరిరక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారు. అంతే కాకుండా ఏదైనా చికిత్స అవసరమైతే వారికి ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రెఫర్ చేసి ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకుంటారు.
- చివరగా 5వ దశలో ఆరోగ్యశ్రీ ద్వారా అవసరమైన వైద్య సేవలు రోగులకు అందుతున్నాయా లేదా అని ఫ్యామిలీ డాక్టర్లు, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు రెఫర్ కేసులకు సంబంధించి పర్యవేక్షిస్తారు. రోగం పూర్తిగా నయం అయ్యిందా లేదా అని మరోమారు పరిశీలిస్తారు.

విజయవంతం చేద్దాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ఇదివరకే వైద్యాధికారులు, సిబ్బందికి ఈ కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పలు సూచనలు, సలహాలు చేశాం. సర్వే పూర్తయిన అనంతరం పక్కా ప్రణాళికతో వైద్య సేవలు అందించేందుకు శిబిరాలు నిర్వహిస్తాం.

– డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

ఇప్పటి వరకు జిల్లాలో చేసిన వైద్య పరీక్షల వివరాలు

వైద్య పరీక్ష	సంఖ్య
హైపర్ టెన్షన్	76,602
షుగర్	68,096
యూరిన్ టెస్ట్	84,703
హిమోగ్లోబిన్	1,454
మలేరియా	1,089
డెంగీ	383
కఫం	961
కఫం శాంపిల్స్ సేకరణ	960
మొత్తం పరీక్షలు	2,33,159

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు



ఈ నెల 15వ తేదీ నుంచి స్థానిక ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, వైద్యాధికారుల సహకారంతో ఇంటింటి సర్వే చేపట్టి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేస్తున్నాం. అన్ని రకాల వైద్య పరీక్షలకు సంబంధించిన మెడికల్ కిట్లు అందడంతో సర్వే వేగంగా సాగుతోంది. వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరాల నిర్వహణపై సమాచారం ఇస్తున్నాం.

– లక్ష్మమ్మ, హెల్త్ సెక్రటరీ, ఎం.ఎస్‌నగర్, నంద్యాల

పేదలకు ఎంతో మేలు



గత కొన్నేళ్లుగా నేను మధుమేహం వ్యాధితో ఇబ్బంది పడుతున్నాను. ఉదయం తినక ముందు, తిన్న తరువాత వైద్య పరీక్షల నిమిత్తం డబ్బులు చెల్లించి మరీ ల్యాబ్‌ల వద్ద వేచి చూడాల్సిన దుస్థితి ఉండేది. కానీ నేడు అలాంటి పరిస్థితి లేదు. అక్టోబర్ 3వ తేదీన జరిగే వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు పరీక్షించి మరిన్ని మందులు అందించనున్నారని అధికారులు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో మా లాంటి వాళ్లకు ఎంతో మేలు జరుగుతుంది.

– గంగిశెట్టి శ్రీదేవి, ఏంఎస్ నగర్, నంద్యాల

వరుణుడు కటాక్షించాలని..



సహస్ర ఘటాభిషేకం పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు




వరుణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

- యాగంటిలో సహస్ర ఘటాభిషేకం

బనగానపల్లె రూరల్: వరుణుడి కటాక్షం కోసం పవిత్ర యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకంతో పాటు వరుణ యాగం నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఆయకట్టు గ్రామాల ప్రజలు, వేదపండితులు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సహస్ర ఘటాభిషేకంలో భాగంగా ఉదయం ఆలయంలో స్వామి వారి గర్భగుడికి ఎదురుగా ప్రత్యేకంగా శివలింగాకారంలో కలశాలను ఏర్పాటు చేసి, శివుడికి గణపతి పూజ, పుణ్యావాచనం, 108 కలశాలతో కలశ పూజ నిర్వహించారు. అనంతరం కలశాలలోని నీటితో పాటు వెయ్యి బిందెలతో ఆలయంలో కొలువైన శివపార్వతులకు జలాభిషేకం చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండంలో వేదపండితులు వరుణయాగాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సహస్ర ఘటాభిషేకం, వరుణ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, శ్రీ ఉమా మహేశ్వర స్వామి నిత్యాన్నదాన సంస్థ కార్యదర్శి మల్కిరెడ్డి దస్తగిరిరెడ్డి, ఆలయ అర్చకులు మహేష్‌శర్మ, లోక్‌నాథ్‌వర్మ, సత్యనారాయణ, పూరావస్తుశాఖ సిబ్బంది శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు బింగిమళ్ల హనుమాన్, పుల్లారెడ్డి, రమణ, మల్లేష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి ఆలయ ఆయకట్టు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.9 లక్షలు టోకరా

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.9 లక్షలు తీసుకుని తమను మోసం చేశారని డోన్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 115 ఫిర్యాదులు అందాయి. 2019లో డోన్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి వెల్దుర్తికి చెందిన ప్రశాంత్‌బాబు, సంజీవయ్య కొండలు రూ.9 లక్షలు వసూలు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగం రాకపోయే సరికి మోసపోయామని భావించిన బాధితుడు ఎస్పీని ఆశ్రయించారు. అలాగే నందికొట్కూరు సీఎస్‌ఐ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న దివాకర్ అనే ఉపాధ్యాయుడుకి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించి రూ.12 వేలు వసూలు చేయడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అధికంగా సివిల్ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదుల్లో చట్టపరిధిలో ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐలు దస్తగిరి బాబు, సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.

మురిసి 'నది'

కుందూ నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో నది జలకళ సంతరించుకుంది. వాగులు, వంకలు ఉప్పొంగి వరద నీరు నదికి చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలోకి నీరు పుష్కలంగా చేరడంతో తీర ప్రాంతాల రైతుల సాగునీటి కష్టాలు తీరిపోనున్నాయి. వచ్చే నెల నుంచి రబీ సీజన్ ప్రారంభం తరుణంలో నదిలో నీటి ప్రవాహం ఉండటంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం నెలకొంది.

– కోవెలకుంట్ల



కోవెలకుంట్ల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

శ్రీశైల క్షేత్ర కీర్తిని ప్రపంచానికి చాటుతాం

- అందరి సహకారంతో క్షేత్రాభివృద్ధికి మరింత కృషి
- సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం
- శ్రీశైల దేవస్థాన నూతన ఈఓ డి.పెద్దిరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలసి వెలసిన పుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్ర కీర్తి ప్రతిష్ఠతలను ప్రపంచానికి చాటేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని శ్రీశైల దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. సోమవారం పరిపాలన భవనంలో పూర్వ ఈఓ ఎస్.లవన్న నుంచి ఆయన అధికార బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఈఓ పెద్దిరాజు కుటుంబ సమేతంగా మల్లికార్జున స్వామివారి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో ఈఓకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓగా అధికార బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామిఅమ్మవార్ల అనుగ్రహంతో ఈఓగా బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యుల సహకారంతో క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వసతి, సౌకర్యవంతమైన స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పించేందుకు ప్రత్యేక చొరవ చూపుతానని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన ఈఓలు, ట్రస్ట్ బోర్డు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేస్తానని తెలిపారు. దాతల సహకారంతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతిరోజు ఉభయ దేవాలయాల్లో జరిగే నిత్యపూజలు, సర్కారీవారి పూజలు, ఆర్జితసేవలు యథావిధిగా శాస్త్రోక్తంగా, ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. శ్రీశైలంలో ఏటా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది, దసరా ఉత్సవాలు మరింత వైభవోపేతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ద్వారకా తిరుమల, శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓగా విధులు నిర్వహించిన అనుభవంతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ధర్మకర్తల మండలి, అర్చకులు, దేవస్థానం సిబ్బంది అందరి సహకారంతో క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

'మహా' వేడుక!

- కర్నూలులో నేడు గణేష్ నిమజ్జనోత్సవం
- 2,200 విగ్రహాల నిమజ్జనానికి వినాయక ఘాట్‌లో ఏర్పాట్లు



ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో వినాయక ఘాట్

కర్నూలు కల్చరల్: నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలందుకున్న మహా గణపతి నిమజ్జనోత్సవానికి అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. మంగళవారం ఆదిదేవుడు గంగమ్మ ఒడి చేరేందుకు శోభాయాత్రగా కేసీ కెనాల్‌కు తరలిరానున్నారు. వీధి వీధిన ప్రతిష్ఠించిన గణనాథుల నిమజ్జనం 'మహా' వేడుకగా ప్రజల మదిలో నిలిచిపోనుంది. కర్నూలులోని బుధవారపేట, మించిన్ బజార్‌లో 1980లో రెండు విగ్రహాలతో గణేశ్ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గత 43 సంవత్సరాలలో ఏటికేడు విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది విగ్రహాల సంఖ్య 2,200లకు చేరుకుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో గణేష్ మహోత్సవాల నిర్వహణలో కర్నూలుకు ప్రత్యేకత స్థానం ఉంది. ఏపీలో ఎక్కడా లేనివిధంగా నగరం నడి మధ్యలో కేసీ కాల్వలో విఘ్నేశ్వరునికి వీడ్కోలు కార్యక్రమం అత్యంత శోభాయమానంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది నూతనంగా నిమజ్జన ఘాట్‌లకు తుంగభద్ర, గంగ, కృష్ణవేణి, కావేరి పేర్లతో నామకరణం చేశారు. వినాయక్ ఘాట్ పక్కనున్న సత్యనారాయణ స్వామి ఆలయంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది.

పది ఘాట్లలో నిజమ్జనం

- వినాయక ఘాట్‌లో మొత్తం పది ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.
- ఏడు చోట్ల క్రేన్లతో, మూడు చోట్ల చేతుల మీదుగా నిమజ్జనం సాగుతుంది.
- వినాయక్ ఘాట్‌లో సుమారు 2వేల మంది నిమజ్జన ఏర్పాట్లలో పాల్గొంటున్నారు.
- మహిళలకు ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటు.

నేటి నుంచి ఆర్‌బీకేల్లో శనగ విత్తనం రిజిస్ట్రేషన్లు

- 10 రోజుల ముందుగానే విత్తనాల పంపిణీకి శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాభావం వల్ల ఖరీఫ్ సీజన్ నిరాశపరిచిన నేపథ్యంలో ప్రభుత్వం రబీ సాగుకు అవసరమైన శనగ విత్తనాలను ముందస్తుగానే కేటాయిస్తోంది. ముందస్తు రబీ కోసం శనగ విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో మంగళవారం నుంచే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. కర్నూలు జిల్లాకు 67,094 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 28,747 క్వింటాళ్ల కేటాయిస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విత్తనాల పంపిణీకి మార్గదర్శకాలు విడుదల చేయడంతో పాటు ధరలు కూడా ఖరారు అయ్యాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా 40 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తుండటం విశేషం. వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో ఈ సారి ముందస్తు రబీకి రైతులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో విత్తనాల పంపిణీ 10 రోజుల ముందుగానే సాగుతోంది. ఈ విడత 20 కిలోలతో కూడిన ప్యాకెట్లను పంపిణీకి సిద్ధం చేయడం విశేషం. గత ఏడాది వరకు ఎకరాకు 25 కిలోల ప్రకారం పంపిణీ చేయగా.. ఈ సారి రైతులు కోరిన మేరకు ఎకరాకు 40 కిలోలు చొప్పున పంపిణీ చేయనున్నారు. క్వింటా పూర్తి ధర రూ.8,100 కాగా.. 40 శాతం సబ్సిడీ(రూ.3,240) పోను రైతులు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుంది. ఇదిలాఉంటే కర్నూలు జిల్లాకు 67,094 క్వింటాళ్లు కేటాయించగా జిల్లా యంత్రాంగం 17,094 క్వింటాళ్లు బఫర్‌లో పెట్టింది. మిగిలిన 50 వేల క్వింటాళ్లను ఖరీఫ్‌లో మిగిలిపోయిన ఏరియా, రబీలో సాగయ్యే విస్తీర్ణాన్ని బట్టి మండలాల వారీగా విత్తనాలు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

క్లుప్తంగా

ఆర్మీ సెలక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా



ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: గుంటూరులో ఈనెల 24న నిర్వహించిన ఆర్మీ సెలక్షన్స్‌లో తిరుపతి ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించినట్లు అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతిలోని అకాడమీలో ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికైనట్లు తెలిపారు. టెక్నికల్–17, జీడీ–66, ట్రేడ్స్‌మెన్–2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయినట్లు చెప్పారు.

న్యాయం కోసం..

- ప్రియుడి ఇంటి ముందు యువతి దీక్ష



ప్రియుడి ఇంటి ముందు కూర్చున్న నాగవేణి

ఆదోనిఅర్బన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడని ఓ యువతి సోమవారం ఆదోనిలో ప్రియుడి ఇంటి ముందు నిరసనకు దిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో న్యూ మహాత్మాగాంధీనగర్‌కు చెందిన ఈరన్న కుమారుడు ఉరుకుంద, నాగవేణి ప్రేమించుకున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని గర్భవతి చేశాడు. తర్వాత పెళ్లి చేసుకోకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పెళ్లి చేసుకుంటానని అంగీకరించిన ఉరుకుంద రెండు రోజుల నుంచి చెప్పాపెట్టకుండా ఇంటికి తాళం వేసి వెళ్లాడని బాధిత యువతి వాపోయారు. దీంతో తను న్యాయం కోసం ఇంటి ముందు దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.

వామ్మో జ్వరం!

జ్వర బాధితులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

- 923 మందికి టైఫాయిడ్, 300 మందికి డెంగీ నిర్ధారణ
- అప్రమత్తమైన ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు
- పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లోనూ చికిత్స

వాతావరణ మార్పులతో గత కొద్ది రోజులుగా జ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్‌తో పాటు డెంగీ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో జిల్లాలోని ఏ ఆసుపత్రి చూసినా జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు పెద్దాసుపత్రిలో ఓపీకి ప్రతిరోజు 350 నుంచి 400 మంది వివిధ రకాల వ్యాధులతో చికిత్స కోసం వస్తుంటారు. వీరిలో 50 నుంచి 60 మంది జ్వరపీడితులే ఉంటుండంతో అధికారులు అప్రమత్తమై క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టారు.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 28 మంది అర్బన్ హెల్త్ సెంటర్లు, 426 విలేజ్ హెల్త్ క్లినిక్స్, రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక బోధనాసుపత్రి ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ 600 నుంచి 800 మంది దాకా జ్వరపీడితులు చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో సాధారణ వైరల్ ఫీవర్ బాధితులే ఎక్కువ. ఆ తర్వాత టైఫాయిడ్, డెంగీ కేసులు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు డెంగీ కేసులు కేవలం పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా ఉండేవి. ఇప్పుడు పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటి సంఖ్య అధికంగా ఉంటుంది. డెంగీ లక్షణాలతో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది. దీంతో పలు ప్రైవేటు ఆసుపత్రులు జ్వరం అని వెళితే అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, మందులు రాసి రూ.2వేల నుంచి రూ.3వేల బిల్లు చేస్తున్నారు. మరి కొన్ని ఆసుపత్రులు ర్యాపిడ్ టెస్ట్‌లో డెంగీ నిర్ధారణ అయితే అదే రిపోర్ట్‌గా భావించి డెంగీ పేరుతో ఆసుపత్రిలో రోగిని చేర్చుకుని చికిత్స చేస్తున్నారు. రోగి ఆరోగ్యస్థితిని బట్టి డిశ్చార్జ్ అయ్యేలోగా రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు అవుతోంది. నిజంగా డెంగీ అని తేలితే మాత్రం బిల్లు కొన్నిసార్లు లక్షల్లో ఉంటోంది.

పెద్దాసుపత్రిలో కిటకిట

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ మెడిసిన్ ఓపీకి ప్రతిరోజూ 350 నుంచి 400 మంది వివిధ రకాల వ్యాధులతో చికిత్స కోసం వస్తుంటారు. వీరిలో 50 నుంచి 60 మంది జ్వరపీడితులే ఉంటున్నారు. చిన్నపిల్లల విభాగంలోనూ ఓపీ 300 దాకా ఉంటుండగా జ్వరాలతో 20 శాతం మంది చిన్నారులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీంతో అటు పెద్దలు, ఇటు చిన్నపిల్లలతో పెద్దాసుపత్రి విభాగాలు కిటకిటలాడుతున్నాయి. కొన్ని మెడికల్ యూనిట్లలో పడకలకు మించి రోగులు చికిత్స తీసుకునే పరిస్థితి నెలకొంది.

గ్రామాల్లో వీహెచ్‌సీలు పెద్ద దిక్కు

గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్ పెద్ద దిక్కుగా మారాయి. ఒకప్పుడు జ్వరం వచ్చినా మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఏఎన్ఎంలే ఇంటింటికి వచ్చి జ్వరం ఉంటే వారిని విలేజ్ హెల్త్ క్లినిక్‌కు తీసుకెళ్లి వైద్యం చేయిస్తున్నారు. అక్కడున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. వారి పరిధిలో లేని వ్యాధులకు పీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని వైద్యులతో వీడియో కాల్స్ మాట్లాడి చికిత్స చేసి పంపిస్తున్నారు. ఫలితంగా పీహెచ్‌సీలకు వెళ్లకుండా అధిక శాతం ప్రజలు ఇక్కడ వైద్యం అందుకుంటున్నారు. దీంతో పీహెచ్‌సీలకు వెళ్లే వారి సంఖ్య ఇటీవల కాలంలో బాగా తగ్గుతోందని డాక్టర్లు చెబుతున్నారు.



కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో జనరల్ మెడిసిన్ విభాగం వద్ద రోగుల రద్దీ

సంవత్సరం	టైఫాయిడ్ పరీక్షలు	నిర్ధారణ	డెంగీ పరీక్షలు	నిర్ధారణ
2021	2,855	516	1,169	170
2022	1,478	447	4,088	342
2023	1,880	923	1,965	300

యూపీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం


జిల్లాలోని వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ)లలో మెరుగైన వైద్యం అందుతోంది. సాధారణ జ్వరాలు వచ్చిన వారందరూ కార్పొరేట్‌ను తలపిస్తున్న ఈ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు అక్కడి వైద్యులు, సిబ్బంది అవసరమైన పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఇక్కడి వైద్యసేవలపై సైతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ పది మందికి చెబుతున్నారు. ఈ కారణంగా ఇటీవల కాలంలో యూపీహెచ్‌సీలలో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

జ్వర పీడితులు అధికంగా వస్తున్నారు



ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి ప్రతిరోజూ 350 మందికి పైగా రోగులు ఓపీకి వస్తుంటారు. వీరిలో 50 నుంచి 60 మంది జ్వర పీడితులే ఉంటున్నారు. ఇందులో వైరల్ ఫీవర్లతో బాధపడేవారు ఎక్కువ. మిగిలిన వారిలో ఒకరిద్దరు డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో బాధపడేవారున్నారు. వీరందరికీ అవసరమైన మందులు, పరీక్షలు ఆసుపత్రిలోనే ఉచితంగా అందజేస్తున్నాము. సీజనల్ మార్పులతో ఇటీవల జ్వరపీడితుల సంఖ్య పెరిగింది.

– డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్‌ఓడీ, జనరల్ మెడిసిన్ విభాగం, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల



శ్రీశైల మల్లన్న ఆలయం (ఇన్‌సెట్) వి.శ్రీనివాసులు





అవార్డుకు ఎంపికైన ఫొటోలు: శ్రీశైలం ప్రాజెక్టు, కొండారెడ్డి బురుజు (ఇన్‌సెట్) డి.హుస్సేన్

సాక్షి ఫొటోగ్రాఫర్లకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించనున్న ఛాయా చిత్ర ప్రదర్శనకు సాక్షి ఫొటోగ్రాఫర్లు డి.హుస్సేన్, వి.శ్రీనివాసులు తీసిన ఫొటోలు ఎంపికయ్యాయి. వీరికి ఈ నెల 27న విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ప్రతిభా పురస్కారంలో భాగంగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందజేయనున్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం–స్పందనలో వచ్చే అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం– స్పందనలో ఆమె జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలకు ఉన్నతాధికారులు సరైన ఎండార్స్‌మెంట్ చేయాలన్నారు. లేకపోతే అర్జీ రీఓపెన్ అయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి పనిచేయాలని, పరిష్కారమైన తరువాత అర్జీదారుని అభిప్రాయాన్ని జగనన్న పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూధన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నగప్రసన్న లక్ష్మీ పాల్గొన్నారు.

మల్లన్నకు శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ



దీపాలను వెలిగిస్తున్న ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవను దేవస్థానం నూతన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు నిర్వహించారు. పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చారణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.

ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 5వ తేదీనాటికి వివిధ దశల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌సెంటర్ల నిర్మాణాలును పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మండలాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల్లో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, ఆదోని మండలాల్లో పురోగతి తక్కువగా ఉందన్నారు. హౌసింగ్‌కు సంబంధించి ఆప్షన్–3 గృహాల నిర్మాణాల్లో వేగం పెరిగేలా చూడాలన్నారు.

ఆన్‌లైన్ మీషో పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

కర్నూలు: ' షాపింగ్ ఆన్‌లైన్ మీషో యాప్ కస్టమర్ కాల్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వివరాలు అడిగి నా బ్యాంకు ఖాతా నుంచి రూ.1.26 లక్షలు కాజేశారు. విచారణ జరిపి న్యాయం చేయాల'ని కర్నూలు సంపత్‌నగర్‌కు చెందిన హీనాబీ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ యాప్‌లో గిఫ్ట్ కోసం ఆర్డర్ ఇవ్వగా వచ్చిన గిఫ్ట్ నచ్చకపోవడంతో రిటర్న్ పంపామని, మీషో యాప్ కస్టమర్ కాల్ అని తమకు ఫోన్ చేసి వివరాలు అడిగి తన బ్యాంకు ఖాతా ద్వారా డబ్బులు కాజేసినట్లు ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో హీనాబీ పేర్కొన్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో ఫిర్యాదులు స్వీకరించారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- గురుకుల పాఠశాలలో ఫిజికల్ ట్రైనర్ ఉద్యోగం ఇప్పిస్తామని అనంతపురం కోచింగ్ సెంటర్‌లో కోచ్‌గా పనిచేస్తున్న వికాస్ కుమార్ అనే వ్యక్తి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలుకు చెందిన రమీజాబీ ఫిర్యాదు చేశారు.
- బెంగుళూరు ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.50 లక్షలు డబ్బులు తీసుకుని ఒక వ్యక్తి మోసం చేశాడని క్రిష్ణగిరి మండలం కోటకొండ గ్రామానికి చెందిన ధనుంజయ వాపోయాడు.
- కర్నూలు లక్ష్మీనగర్‌లోని సంతోషి మాన్షన్ అపార్ట్‌మెంట్‌లో తన భర్త ఫ్లాట్ తీసుకున్నాడని, ఇటీవలే ఆయన చనిపోవడంతో ఫ్లాట్ విక్రయించినవారు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బెంగుళూరుకు చెందిన శాంతిదీప్తి అనే మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

చెంచులకు మౌలిక వసతుల కల్పన

- బీ తాడిపత్రి చెంచుగూడెంకు రహదారి మంజూరు
- రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- 2.కి.మీ కాలినకడన గూడేంకు చేరిన జెడ్పీ చైర్మన్



చెంచుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: జనజీవనానికి సుదూరంగా ఉంటున్న బీ తాడిపత్రి చెంచులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. బి.తాడిపత్రి సమీపంలోని కొండలో 80 ఏళ్ల నుంచి 30 చెంచుకుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సోమవారం జెడ్పీ చైర్మన్ బి.తాడిపత్రి నుంచి 2కి.మీ దూరాన కొండలో ఉన్న గూడెంకు కాలినడకన వెళ్లి వారి సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో చెంచులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. కొన్ని దశాబ్దాలుగా చెంచులు ఇక్కడ నివాసముంటున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తమ పాలనలో చెంచులకు బి.ఉప్పలూరు నుంచి గూడెం వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. తాగునీటి సౌకర్యం లేక పోవడంతో బోరు వేసి, మోటర్ అమర్చి తాగునీటి సమస్య పరిష్కరించామన్నారు. చాలా మందికి ఆధార్ కార్డులు లేక పోవడంతో ప్రత్యేకంగా ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు వర్తింపచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. కాగా ఎన్నో ఏళ్లుగా తాము ఇక్కడ ఉంటున్నా ఎవరూ పట్టించుకోలేదని, తమ కష్టాలు చూసి మాకు కరెంట్, నీళ్ల సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని చెంచెలు జెడ్పీ చైర్మన్‌తో చెప్పారు. కొంత మందికి రేషన్ కార్డులు రాలేదని ఆయన దృష్టికి తీసుకురావడంతో అక్కడి నుంచి తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌కు ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

రోడ్డు పనుల పరిశీలన

బి.తాడిపత్రి నుంచి చెంచుగూడెంకు రోడ్డు మంజూరు కావడంతో పనులను జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరిశీలించారు. బి తాడిపత్రి నుంచి జగన్నాథ బావి వరకు రూ.24.50 లక్షలతో సీసీ రోడ్డు, అక్కడి నుంచి చెంచుగూడెం వరకు రూ.17 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించనున్నామన్నారు. గూడెంకు నడిచి పోవడానికి కూడా సరిగా మార్గం లేకుండా పోవడంతో రోడ్డు మంజూరు చేయించామన్నారు. రోడ్డు నిర్మాణం చేసే చోట నుంచి నడిచి వెళ్లే మధ్యలో కొండల నుంచి నీళ్ల ప్రవహించే చోట కల్వర్టులు నిర్మించే వాటిపై చర్చించారు. రోడ్డు పూర్తయితే గూడెం వరకు 104,108 అంబులెన్స్ సేవలు కల్పిస్తామని చెప్పారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం రవాణాదారులను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కర్నూలు: టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో భారీగా కర్ణాటక మద్యం పట్టుబడింది. వినాయక చవితి నిమజ్జనాన్ని పురస్కరించుకుని జిల్లాలోకి పక్క రాష్ట్రాల మద్యం రవాణా కాకుండా నియంత్రించేందుకు కర్నూలు మండలం పంచలింగాల అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజశేఖర్ గౌడ్, చెక్‌పోస్టు సీఐ శేషాచలం, ఎస్‌ఐలు ప్రసాదరావు, అన్వేష్, స్వామినాథన్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అలంపూరు వైపు నుంచి టాటా ఏస్ మ్యాజిక్ వాహనం ఏపీ 21 ఎక్స్ 6886ను ఆపి తనిఖీ చేయగా అందులో 60 బాక్సుల్లో 5,760 బాటిళ్ల ఒరిజినల్ ఛాయిస్ కర్ణాటక మద్యం బయటపడింది. వాహనంలో ఉన్న డ్రైవర్‌తో పాటు పక్కనున్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి తీసుకువస్తున్నట్లు బయటపడింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గుడిసెగుప్పరాళ్ల గ్రామానికి చెందిన ఈడిగ రవీంద్ర, రాయచూరుకు చెందిన ఈరన్న గౌడులను అదుపులోకి తీసుకుని విచారించగా రాయచూరుకు చెందిన చంద్రబాబు అనే వ్యక్తి పంపినట్లు బయటపడింది. కర్నూలుకు చేరుకోగానే సర్దార్ అలియాస్ బాషా అనే వ్యక్తికి ఫోన్ చేసి మద్యం అప్పగించాలని ఫోన్ నంబర్ కూడా ఇచ్చినట్లు ఈరన్న గౌడు, ఈడిగ రవీంద్ర తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్న ఇరువురు ఇచ్చిన సమాచారం మేరకు రాయచూరుకు చెందిన చంద్రబాబు, బాషాలపై కూడా కేసు నమోదు చేసి త్వరలో వారిని కూడా అరెస్టు చేయనున్నట్లు సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెంకటరాముడు, షేక్‌షావలి, కరుణాకర్, బషీర్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలు వరుసగా భాస్కర్ (పసుపుల), సుబ్రమణ్యం(బనగానపల్లె), సి.కమలమ్మ (చాగలమర్రి)

పల్లె సేవకు పురస్కారం

- నలుగురు క్లాప్‌మిత్రలను సన్మానించిన ఎస్‌పీసీ ఎండీ గంధం చంద్రుడు

కర్నూలు(అర్బన్)/బనగానపల్లె/చాగలమర్రి: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమల్లో ఉత్తమ సేవలు అందించిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నలుగురు క్లాప్‌మిత్రలకు ఘన సన్మానం లభించింది. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కే మేరీ, పసుపుల గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న భాస్కర్, నంద్యాల జిల్లా బనగానపల్లె పంచాయతీలో పని చేస్తున్న సుబ్రమణ్యం, చాగలమర్రిలో విధులు నిర్వహిస్తున్న సి. కమలమ్మను సోమవారం విజయవాడలోని పీఆర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి పురస్కారాల్లో ఘనంగా సన్మానించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, పీఆర్ అండ్ ఆర్‌డీ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఇద్దరు క్లాప్‌మిత్రలకు శాలువాలు కప్పి సన్మానించారు.



మేరీ (గార్గేయపురం)ని సన్మానిస్తున్న ఎస్‌పీసీ ఎండీ గంధం చంద్రుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

బాబు స్కీములన్నీ స్కాములే



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): చంద్రబాబు నాయుడు తెచ్చిన స్కీముల న్నింటిలోనూ స్కాములు జరిగాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. సోమవారం స్థానిక ప్రైవేటు లాడ్జిలో చంద్రాబాబు స్కీములు– స్కాములు అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రజలు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి, అక్రమాలకు పాల్పడిన వైట్ కాలర్ క్లాసికల్ దొంగ చంద్రబాబు అన్ని అన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని రాష్ట్ర ప్రజల సంపదను కొల్లగొట్టారని, రెండెకరాల నుంచి రూ. లక్షల కోట్లకు ఎదిగారని చెప్పారు. చంద్రబాబు హయాలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మరోవైపు అమరావతిలో రాజధాని పేరుతో రైతుల నుంచి 34వేల ఎకరాల భూమిని సేకరించి పార్టీ నాయకులు, బంధువులు, రియల్టర్లకు వేల ఎకరాలు ధారాదత్తం చేశారని చెప్పారు. ఇన్ని అవినీతి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబును అన్ని ఆధారాలతో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేష్, ఇతర టీడీపీ పెద్దల పాత్ర కూడా ఉందని, వారిని కూడా విచారించాలన్నారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, శ్వేతారెడ్డి, ధనుంజయ ఆచారి, లక్ష్మీకాంతయ్య, యూనుస్, సంధ్యా విక్రమ్, పాత్రికేయులు వెంకన్న, సత్యన్న తదితరలు పాల్గొని మాట్లాడారు.